క్లుప్తంగా

అలరించిన గాత్ర కచేరి



భక్తి గీతాలను ఆలపిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళా వేదికపై సికింద్రాబాద్‌కు చెందిన ఎ.ఎ.విశాలాక్షి, బృందం గాత్రకచేరి అలరించింది. కార్యక్రమంలో మహాగణపతిం, శంకరా, శివశంకరా, సాంబశివా సదాశివ, కాలభైరవాష్టకం, ఆనందామృత, విజయాంబికే, సకల మంత్రముల, అంబావాణీ, గౌరీమనోహర, కైలాసగిరివాసా, దుర్గాదేవి దురితనివారిణి, కామకోటి పీఠవాసిని తదితర గీతాలను, అష్టకాలను ఎ.ఎ.విశాలాక్షి, మహాలక్ష్మి, లలితాహరిప్రియ, లలిత, శ్రీదేవి ఆలపించారు. కార్యక్రమానికి మృదంగ సహకారం గణేష్, వయోలిన్ వినయ్ కృష్ణ అందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థి రాజ్‌కుమార్‌తో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

పాములపాడు: మండలంలోని వేంపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి రాజ్‌కుమార్ త్రోబాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం క్రిష్ణమూర్తి తెలిపారు. శుక్రవారం పాఠశాలలో విద్యార్థిని అభినందించారు. ఇటీవల నంద్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన స్కూల్‌గేమ్స్ జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ఈ నెల 28, 29 తేదీల్లో గుంటూరు జిల్లా పెనమాకలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు నాగరాజును అభినందించారు.

విలీన సభను జయప్రదం చేయండి



పోస్టర్లు విడుదల చేస్తున్న పార్టీ నాయకులు

నందికొట్కూరు: సీపీఐ, ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు నరసింహులు, మజీద్‌మియ్యా పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 28న జరిగే విలీన సభ వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పదేళ్లలో కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతోందన్నారు. దేశంలో ఆకలి, అసమానతలు, నిరుద్యోగ హక్కులను ప్రశ్నించే వారిని అణిచివేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అరుణ్‌కుమార్, గోపాల్, తిక్కయ్య, శివ, నాగార్జున చూరీబీ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమల్లో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న ఏఐకేఎం నాయకులు

నందికొట్కూరు: ఎన్నికల సమయంలో కూటమి పార్టీలు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం చేతులు ఎత్తేసిందని ఏఐకేఎం జిల్లా నాయకుడు వెంకటేశ్వర్లు విమర్శించారు. శుక్రవారం పట్టణంలోని సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేయడం తగదన్నారు. హామీల అమల్లో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ నెల 30వ తేదీ రాయల ఫంక్షన్ హాల్‌లో పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరుగుతుందని చెప్పారు. లిబరేషన్ పార్టీ రాష్ట్రస్థాయి నాయకులు, ఏఐఎస్ఏ రాష్ట్రస్థాయి నాయకులు సమావేశానికి హాజరవుతున్నట్లు తెలిపారు.

సీసీ రోడ్లు, డ్రైయినేజీలను ఏర్పాటు చేయాలి

ఆత్మకూరు: స్థానిక స్వరాజ్‌నగర్‌లో సిమెంట్ రోడ్లు వేసి డ్రైయినేజీలను ఏర్పాటు చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్ కోరారు. స్వరాజ్‌నగర్ ప్రజలతో కలిసి సీపీఎం నాయకులు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రణధీర్ మాట్లాడుతూ స్వరాజ్ నగర్‌లో దాదాపు 60 కుటుంబాలు కాపురం ఉంటాయన్నారు. ఆయా కాలనీలో నివసిస్తున్న ప్రజలు ఏటా మున్సిపాలిటీకి ఇంటి పన్ను చెల్లిస్తున్నారన్నారు. కాలనీ వాసులే చందాలు వేసుకుని వీధిలైట్లు ఏర్పాటు చేసుకున్నారన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి కనీసం మౌలిక సదుపాయలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సురేంద్ర, రామ్‌నాయక్, వీరన్న, షేక్ ఇస్మాయిల్, కాలనీవాసులు రఘుస్వామి, రామకృష్ణ, రామారావు, జక్కందాసు, పుల్లన్న, రవి, మహేష్ పాల్గొన్నారు.

విద్యుత్‌పోరు.. నిరసన హోరు

- విద్యుత్ చార్జీల పెంపుపై వైఎస్సార్‌సీపీ చేపట్టిన నిరసన కార్యక్రమానికి తరలివచ్చిన ప్రజలు
- నమ్మించి మోసం చేసిన చంద్రబాబుకు త్వరలోనే బుద్ధి చెబుతామంటూ నినాదాలు
- విద్యుత్ చార్జీలు తగ్గించాలని వైఎస్సార్ సీపీ శ్రేణుల డిమాండ్

విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ చేపట్టిన పోరుబాటలో ప్రజలు కదం తొక్కారు. కూటమి ప్రభుత్వం దగా పాలనపై మండిపడ్డారు. అధికారం చేపట్టిన ఆరు నెలల్లోనే రెండు సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజల నడ్డి విరిచారంటూ పలువురు విమర్శించారు. నమ్మించి మోసం చేసిన చంద్రబాబుకు త్వరలోనే బుద్ధి చెబుతామంటూ నినదించారు. ఇప్పటికైనా చార్జీలు తగ్గించి ప్రజలను ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకులు డిమాండ్ చేశారు. – ఆత్మకూరు



ఆత్మకూరు పట్టణంలో భారీ సంఖ్యలో పోరుబాట ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే, పార్టీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు



విద్యుత్ కార్యాలయం వద్ద ఏడీఈకు వినతి పత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే, నాయకులు

కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, వైఎస్సార్‌సీపీ ఇంటలెక్చ్వల్ ఫోరం అధ్యక్షుడు వై.ఈశ్వరప్రసాద్‌రెడ్డి, సభ్యుడు సంజీవ్ డిమాండ్ చేశారు. పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా శుక్రవారం ఆత్మకూరులో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన పోరుబాట కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో తప్పుడు హామీలు ఇచ్చి ఇప్పుడు మోసం చేస్తున్నారన్నారు. గతంలో విద్యుత్ చార్జీలు తగ్గించాలని హైదరాబాద్‌లో ధర్నా చేసిన రైతులను గుర్రాలతో తొక్కించిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలను పెంచబోమని చెప్పి గద్దెనెక్కిన ఆరు నెలల్లోనే రెండు సార్లు పెంచడం భావ్యం కాదన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రైతన్నల సంక్షేమం కోసం ఉచిత విద్యుత్‌ను అందించారని, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి అడుగుజాడల్లో నడిచి రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించారని గుర్తు చేశారు. చంద్రబాబునాయుడు మాత్రం ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చకపోవడంతోపాటు ప్రజపై భారాలు మోపుతున్నారని విమర్శించారు. జమిలీ ఎన్నికలు వస్తే కూటమి ప్రభుత్వానికి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. స్థానిక ఎమ్మెల్యే చేస్తున్న నిందారోపణలు ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఆరు నెలల పాలనలో అన్ని వర్గాల ప్రజలు విసిగి పోయారని ఎప్పుడు ఎన్నికలొచ్చినా తమదే విజయమన్నారు. అనంతరం ట్రాన్స్‌కో డీఈ రామసుబ్రహ్మణ్యంకు వినతి పత్రం అందజేశారు.

ర్యాలీకి విశేష స్పందన

విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా శుక్రవారం ఆత్మకూరు పట్టణంలో నిర్వహించిన పోరుబాట ర్యాలీకి విశేష స్పందన లభించింది. భారీలో అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనడంతో పార్టీ కార్యకర్తలు జోష్ వచ్చింది. గౌడ్ సెంటర్, నంద్యాల టర్నింగ్ మీదుగా విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు ర్యాలీ సాగింది. ర్యాలీలో కూటమి సర్కార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆత్మకూరు, బండిఆత్మకూరు, వెలుగోడు, మహానంది, శ్రీశైలం నియోజకవర్గం నుంచి కార్యకర్తలతోపాటు ప్రజలు తరలివచ్చి ర్యాలీ పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ, మండల నాయకులు సయ్యద్‌మీర్ రాజమోహన్‌రెడ్డి, అహ్మద్‌హుసేన్, అంజాద్‌ఆలీ, వెలుగోడు ఎంపీపీ లాలం రమేష్, వెలుగోడు జెడ్పీటీసీ సభ్యులు, దేశం తిరుపం రెడ్డి, పార్టీ మండలాధ్యక్షులు అంబాల ప్రభాకర్ రెడ్డి, పట్టణ మండలాధ్యక్షులు ఇలియాజ్‌ఖాన్, మహానంది మండలం జెడ్పీటీసీ సభ్యులు మహేశ్వర్‌రెడ్డి, కేశవ్, నాగేశ్వర్‌రెడ్డి, శ్రీశైలం నుంచి శోభన్‌బాబుతో పాటు సురేష్, అంజాద్‌ఆలీ, కుందూరు శివారెడ్డి, వెంకటస్వామిగౌడ్, మునీర్‌బాషా, బాలస్వామియాదవ్, ప్రతాప్, లక్ష్మిరెడ్డి, బి.రామచంద్రారెడ్డి, లాలు, కరిముల్లా, పార్వతి, దర్గమ్మ, షఫీవున్, మరియమ్మ, విజయ్‌చౌదరి, రామచంద్రయ్య పాల్గొన్నారు.

విద్యుత్‌పై చంద్రబాబు బూటకపు హామీ

- చార్జీల పెంపుపై వైఎస్సార్‌సీపీ నాయకుల ధర్నా
- నందికొట్కూరు పటేల్ సెంటర్ నుంచి విద్యుత్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ



నందికొట్కూరు: డీఈకి వినతి పత్రం అందజేస్తున్నా దార సుధీర్, వైఎస్సార్‌సీపీ నేతలు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దార సుధీర్

నందికొట్కూరు: ఎన్నికల సమయంలో విద్యుత్‌పై చంద్రబాబు బూటకపు హామీలిచ్చారని వైఎస్సార్ సీపీ నందికొట్కూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దార సుధీర్ అన్నారు. విద్యుత్ చార్జీల పెంపుపై శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పోరుబాట పట్టారు. నందికొట్కూరు పటేల్ సెంటర్ నుంచి విద్యుత్ కార్యాలయం వరకు జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు. విద్యుత్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే రద్దు చేయాలంటూ డిమాండ్ చేశారు. సీఎం చంద్రబాబు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం విద్యుత్ కార్యాలయం డీఈ శ్రీనివాసులుకు పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలంటూ సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దార సుధీర్ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచేది లేదని చెప్పిన చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే విద్యుత్ చార్జీలు పెంచడం దుర్మార్గమన్నారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 200 యూనిట్లు ఉచితం విద్యుత్‌ను తుంగలో తొక్కేసి విద్యుత్ చార్జీలు పెంచడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఎన్నికల ముందు ఒక మాట ఎన్నికల తర్వాత మరో మాట మాట్లాడడం చంద్రబాబుకు అలవాటేనన్నారు. విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచి దోచుకుంటోందని మండిపడ్డారు. బాబు షూరిటీ బాదుడు గ్యారంటీ అనే తరహాలో బాబు పాలన ఉందని విమర్శించారు. చంద్రబాబుకు మోసం చేయడం వెన్నతో పెట్టిన విద్య అని చెప్పారు. బాబుకు ఓటు వేసినందుకు ప్రజలు సిగ్గు పడుతున్నారన్నారు. కరెంట్ చార్జీలు పెంచి ప్రజలపై రూ.15 వేల కోట్ల బారం మోపారని ఆరోపించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు పోచా జగదీశ్వరరెడ్డి, సోమల సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ జనార్దన్‌గౌడు, ఎంపీటీసీ సభ్యుడు శివన్న, కౌన్సిలర్ నాయబ్, వైఎస్సార్‌సీపీ నాయకులు కోకిల రమణారెడ్డి, మన్సూర్, పుల్యాల నాగిరెడ్డి, లోకేష్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, నాగరాజు, తులసిరెడ్డి, రమేష్‌నాయుడు, జబ్బార్, రమణ, అక్తర్‌బాషా, ఉపేంద్రారెడ్డి, అబుబక్కర్, తిరుమల్లేష్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, మల్లయ్య, సులోచన, అశోక్‌రెడ్డి, మాధురి, విజ్జి, రవి, లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో ఎస్సీల జాబితా ప్రదర్శన




మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ బేబి

నందికొట్కూరు: పట్టణంలోని వార్డు సచివాలయాల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎస్సీ కులగణనపై సోషల్ ఆడిట్ నిర్వహించినట్లు మున్సిపల్ కమిషనర్ బేబి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సచివాలయాల్లో ఎస్సీ కులగణన వివరాలను ప్రదర్శించినట్లు తెలిపారు. జాబితాపై ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా ఈ నెల 31వ తేదీలోగా తెలియజేయాలని సూచించారు. వార్డు సచివాలయాల వద్దకు వెళ్లి వివరాలు సరిచూసుకోవాలని కోరారు. 2025 జనవరి 6వ తేదీ వరకు అభ్యంతరాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తునట్లు చెప్పారు. సమగ్ర వివరాల సేకరణ అనంతరం వచ్చే నెల జనవరి 10వ తేదీ తుది జాబితా ప్రదర్శిస్తామని పేర్కొన్నారు.

అభ్యంతరాలు ఉంటే తెలియజేయండి

మిడుతూరు: మండల పరిధిలోని అన్ని గ్రామ సచివాలయాల్లో ఎస్సీ సామాజికవర్గ జాబితా ప్రదర్శించామని.. ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని ఎంపీడీఓ దశరథరామయ్య తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. అన్ని సచివాలయాల్లో ఎస్సీ జాబితాను నోటీస్ బోర్డులో ఉంచామన్నారు. అభ్యంతరాలు ఉంటే వినతుల రూపంలో వీఆర్వోకు తెలపాలన్నారు.

భూ సమస్యలను పక్షం రోజుల్లో పరిష్కరిస్తాం



తర్తూరులో ర్యాలీ నిర్వహిస్తున్న తహసీల్దార్



పాములపాడు: తహసీల్దార్‌కు అర్జీ అందజేస్తున్న దృశ్యం

జూపాడుబంగ్లా: రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు ఇచ్చిన భూసమస్యల అర్జీలను పక్షం రోజుల్లో పరిష్కరిస్తామని తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ తెలిపారు. శుక్రవారం మండలంలోని తర్తూరు గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ నాగిరెడ్డి అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. గ్రామాల్లో భూసమస్యలను ఎప్పటికప్పుడు విచారించి పరిష్కరిస్తామని తెలిపారు. వన్‌బీ, అడంగల్, పట్టా పాసుపుస్తకాల్లో పేర్లు, అడ్రస్సుల చేర్పులు, మార్పులు సత్వరమే చేసిస్తామన్నారు. అనంతరం రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో డీటీ సత్యదీప్, మండల సర్వేయర్ అతీఫ్, రమణారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే ధ్యేయం

పాములపాడు: భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సుభద్రమ్మ అన్నారు. శుక్రవారం మండలంలోని కంబాలపల్లి గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె మాట్లాడారు. రైతులు తమ సమస్యలను అర్జీ రూపంలో ఇవ్వాలన్నారు. సమస్యను పరిశీలించి త్వరితగతిన చర్యలు తీసుకుంటామన్నారు. ఒక రైతు ఆన్‌లైన్ కోసం దరఖాస్తు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ ఖాజీబీ, మండల సర్వేయర్లు భాస్కర్, కలిముల్లా, వీఆర్వోలు మగ్బుల్,శివన్న, ఉశేన్,వెంకటేశ్వర్లు, ముర్తుజావలి, పురంధరుడు, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.



రైతు నుంచి వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్

అర్జీల స్వీకరణ

మిడుతూరు: మండల పరిధిలోని చింతలపల్లి గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 8 వినతులు వచ్చినట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని చింతలపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆర్ఐ జహంగీర్, సర్వేయర్ ఉపేంద్ర, వీఆర్వో తదితరులు పాల్గొన్నారు.

పగిడ్యాల: భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శివరాముడు తెలిపారు. ఎం. ఘణపురం సచివాలయం వద్ద రెవెన్యూ సదస్సు ఏర్పాటు చేశారు. ఇనాం భూములకు సంబంధించి 5 అర్జీలు, కౌలతలకు సంబంధించి ఒక అర్జీ వచ్చిందని, వాటిని పరిశీలించి ఆన్‌లైన్ చేసి పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మధు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీరంగారెడ్డి, సర్వేయర్ జ్ఞానప్రకాష్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని శవాల లభ్యంపై విచారణ

కొత్తపల్లి: మండలంలోని కృష్ణానది పరివాహక ప్రాంతం వెంట లభ్యమైన గుర్తుతెలియని శవాల ఆచూకీ కోసం ఆత్మకూరు సీఐ సురేష్ కుమార్ రెడ్డి శుక్రవారం ఎస్ఐ ఎం.కేశవతో కలసి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఈనెల 5వ తేదీ వీరభద్రదుర్గం చీమలతిప్పలో, 23న ముసలిమడుగు గ్రామ శివారులో గుర్తుతెలియని శవాలు లభ్యమయ్యాయని తెలిపారు. ఆ శవాలు ఎవరివి అన్న విషయం ఇంతవరకు తెలియలేదన్నారు. దీంతో శుక్రవారం కృష్ణానది పరీవాహక ప్రాంతమైన వీరభద్ర దుర్గం, చీమలతిప్ప, జానాలగూడెం, బలపాలతిప్ప, సిద్ధేశ్వరం, సంగమేశ్వరం, కపిలేశ్వరం, ఎర్రమఠం, మాడుగుల, ముసలిమడుగు గ్రామాల్లో విచారణ చేశామన్నారు. తీరం వెంట ఉన్న మత్స్యకారులను క్షుణ్ణంగా విచారించామన్నారు. ఎలాంటి వివరాలు తెలియరాలేదని చెప్పారు. త్వరలోనే గుర్తిస్తామని తెలిపారు.

వాహనాల తనిఖీ

మహానంది: నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే చట్టపర మైన చర్యలు తీసుకుంటామని మహానంది ఎస్ఐ రామ్మోహన్ రెడ్డి హెచ్చరించారు. నంద్యాల–గిద్దలూరు నల్లమల ఘాట్‌రోడ్డులోని గాజులపల్లె, బోయిలకుంట్ల వద్ద శుక్రవారం రాత్రి వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ నల్లమల ఘాట్‌రోడ్డులో ప్రమాదకర మలుపులు ఉన్నాయని, వాహనదారులు నిదానంగా వెళ్లి సురక్షితంగా గమ్యం చేరుకోవాలన్నారు.

గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు







మృతుడి కుడి భుజంపై ఆంజనేయస్వామి పచ్చబొట్టు, కుడిచేతి మణికట్టు పైభాగంలో..

పాములపాడు: తెలుగుగంగ కాల్వ లో ఈ నెల 27న లభించిన మృతదేహం గుర్తు తెలియనిదిగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్‌బాబు శుక్రవారం తెలిపారు. మండలంలోని వేంపెంట గ్రామ పొలిమేరలో వెలుగోడు పెద్ద బ్రిడ్జికి మధ్యలో తెలుగుగంగ కాల్వలో పురుషుడి మృతదేహం లభించిన విషయం విధితమేనన్నారు. సుమారు 40–50 సంవత్సరాల వయస్సు ఉంటుందని, మృతుడి కుడి చేతి భుజంపై, మణికట్టుపై భాగంలో ఆంజనేయ స్వామి పచ్చబొట్లు ఉన్నాయన్నారు. నలుపు, తెలుపు కలర్ నిలువు అడ్డ గీతలు ఉన్న ఫుల్‌షర్టు, బ్లూ కలర్ నిక్కరు ధరించిన ఆనవాళ్లు ఉన్నాయని తెలిపారు. మృతుడికి సంబంధించిన వారెవరైనా పోలీస్‌స్టేషన్ లో సంప్రదించాలని ఎస్ఐ వివరించారు.

మహానందీశుడి పల్లకీసేవ



మహానందిలో పల్లకీసేవ దృశ్యం

మహానంది: మహానందిలో కొలువైన కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులకు శుక్రవారం రాత్రి పల్లకీసేవ నిర్వహించారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వర శర్మ, ఆంజనేయశర్మ, హనుమంతుశర్మ, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

మన్మోహన్ సింగ్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

పాములపాడు: మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ మృతికి పాములపాడులో కాంగ్రెస్, ప్రజా సంఘాల నాయకులు సంతాపం తెలిపారు. శుక్రవారం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ పీఎంసీ చైర్మన్ షేక్షావలీ, మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు అంకన్న మాట్లాడుతూ.. మన్మోహన్ సింగ్ గొప్ప ఆర్థిక సంఘ సంస్కర్త అని కొనియాడారు. విమర్శలకు తావులేకుండా నిరాడంబర జీవితం గడిపారని.. నిజాయితీగా పాలన చేశారని తెలిపారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు అబ్రహాం, తిరుపతయ్య, మైమాకర్, ముర్తుజవలి, ప్రసాద్, ప్రవీణ్, అలీ తదితరులు పాల్గొన్నారు.

సమావేశానికి గైర్హాజరైన అధికారులకు మెమోలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ గోపికృష్ణ

జూపాడుబంగ్లా: మండల సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైన అధికారులకు మెమోలు జారీ చేయాలని ఎంపీపీ సువర్ణమ్మ ఎంపీడీఓ గోపికృష్ణకు సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఏఓ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ఈనెలాఖరులోగా రబీ పంటలకు బీమా చేయించుకోవాలని తెలిపారు. కందులకు ప్రభుత్వం రూ.7,550 మద్దతు ధర ప్రకటించగా బహిరంగ మార్కెట్‌లో అంతకంటే తక్కువగా ఉన్నందున కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. రైతుసేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకుని మద్దతు ధరకు కందులు విక్రయించుకోవాలన్నారు. 40 శాతం రాయితీతో రైతులకు త్వరలో డ్రోన్లు అందజేయనున్నట్లు చెప్పారు. 21వ పశుగణన జరుగుతుండగా మండలం వ్యాప్తంగా 9,009 హౌస్‌హోల్డ్స్ ఉండగా అందులో ఇప్పటి వరకు 7,050 ఇళ్లకు సర్వే పూర్తయినట్లు వెటర్నరీ డాక్టర్ పావనిరెడ్డి తెలిపారు. 35 శాతం రాయితీతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు రుణాలు మంజూరు చేస్తున్నట్లు ఏపీఎం అంబమ్మ తెలిపారు. 2025 మార్చి నెలాఖరులోగా గృహనిర్మాణాలు పూర్తిచేసుకోవాలని ఏఈ జ్యోతి తెలిపారు. 2016 నుంచి ఇప్పటి వరకు ఇళ్లు నిర్మించుకుని బిల్లులు మంజూరు కాని వారికి బిల్లులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. మార్చి తర్వాత కొత్త ఇళ్లు మంజూరయ్యే అవకాశం ఉందని.. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇన్‌చార్జి ట్రాన్స్‌కో ఏఈ హరి మాట్లాడుతుండగా ఎంపీడీఓ గోపికృష్ణ కల్పించుకుని సచివాలయాల జేఎల్‌ఎంలు సక్రమంగా విధులు నిర్వర్తించటం లేదన్నారు. పాఠశాలల్లో 85మంది ఉపాధ్యాయులకు 13 పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఎంఈఓ చిన్నమద్దిలేటి తెలిపారు. రూ.5 కోట్లతో ఇసుక వాగుపై పారుమంచాల వద్ద వంతెన నిర్మిస్తున్నామని జూన్‌లోగా పూర్తి చేయిస్తామని ఆర్‌అండ్‌బీ ఏఈ తెలిపారు. తరిగోపులలో చెత్తసేకరణ కేంద్రం త్వరలో పూర్తిచేయిస్తామని ఈఓపీఆర్డీ అన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం



డీఎఫ్‌ఓను సన్మానిసన్తున్న ఉపాధ్యాయులు

పగిడ్యాల: పర్యావరణాన్ని పరిరక్షించి భావితరాలను కాపాడుకుందామని డీఎఫ్ఓ సామేలు విద్యార్థులకు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పర్యావరణ పరిరక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పెరుగుతున్న జనాభా, అంతరించిపోతున్న అడువుల కారణంగా పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని పేర్కొన్నారు. మొక్కలు నాటడం వల్ల స్వచ్ఛమైన గాలి, నీరు, వాతావరణం ఆవిష్కృతమవుతుందని విద్యార్థులకు వివరించారు. మొక్కల నుంచి మానవునికి కావాల్సిన ఆక్సిజన్ విడుదల అవుతుందని, మానవులు విసర్జించే కార్బన్‌డైయాక్సైడ్‌ను మొక్కలు స్వీకరించి స్వచ్ఛమైన ప్రాణవాయువును విడుదల చేస్తాయని పేర్కొన్నారు. మొక్కల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. రోడ్లకు ఇరువైపులా, పొలం గట్ల వెంట మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అనంతరం డీఎఫ్ఓను ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్‌రావు సన్మానించారు. ఉపాధ్యాయులు ఎస్ఏ రషీద్, పీతాంబరరెడ్డి పాల్గొన్నారు.

ఇస్తెమా పనుల పరిశీలన



ఇస్తెమా పనులను పరిశీలిస్తున్న శిల్పా చక్రపాణిరెడ్డి, నాయకులు

ఆత్మకూరు: పట్టణంలోని వచ్చే నెల జనవరి 7 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న ఇస్తెమా పనులను మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, కార్యకర్తలు శుక్రవారం పరిశీలించారు. ముస్లింలతో మాట్లాడి పనులను వేగవంతం చేయాలన్నారు.

మాజీ ప్రధానికి ఘన నివాళులు

మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, పార్టీ ఇంటలెక్చ్వల్ ఫోరం అధ్యక్షులు వై.ఈశ్వరప్రసాద్ రెడ్డి, సభ్యులు సంజీవ్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.